ప్రజాశక్తి
మంగళవారం 11 నవంబరు, 2025
5
శ్రీకాకుళం

ఎఎన్ఎంల సమస్యపై కలెక్టర్ ఆరా

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి- కవిటి

ఈ నెల 10న 'వ్యాక్సిన్ వేసేదెవరు?' అంటూ 'ప్రజాశక్తి'లో వచ్చిన కథనాకి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పందించారు. సోమవారం ఉదయం రాజపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు డాక్టర్ శశిధర్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. డిప్యుటేషన్ ఎఎన్ఎంలు సక్రమంగా పనిచేయనప్పుడు ఎందుకు ఊరుకున్నారని ప్రశ్నించారు. ఆస్పత్రి సిబ్బంది పనితీరు గురించి తెలుసుకున్నారు. ఏదేమైనా చిన్నారులు, గర్భిణుల వైద్య సేవలకు విఘాతం కలగడానికి లేదని స్పష్టం చేశారు. పిహెచ్‌సి పరిధిలో పూర్తి సమాచారంతో మంగళవారం కలెక్టర్ కార్యాలయానికి చేరుకోవాలని ఆదేశించారు.

ఆరుగాలం శ్రమించి పండించిన రైతుల పట్ల ప్రభుత్వం కనికరించలేదు. నిబంధనల పేరుతో పంట నష్టానికి కోత పెట్టింది. ఏళ్ల తరబడి ఉన్న 33 శాతం పైగా నష్టం నిబంధననే అమలు చేసింది. ఫలితంగా ఇటీవల మొంథా తుపాను ప్రభావంతో ప్రాథమికంగా అంచన వేసిన పంటలో సగానికి మాత్రమే పరిహారం అందించడానికి పరిశీలిస్తోంది. పంట ఒక్క శాతం తక్కువైనా అధికారులు పరిగణనలోకి తీసుకోలేదు. ఒక వైపు ఈ ఏడాది ఖరీఫ్‌లో సకాలంలో వర్షాలు లేక అన్నదాతలు ఇబ్బందులు పడ్డారు. వర్షాభావ పరిస్థితుల నుంచి ఏదో రకంగా నెట్టుకొచ్చిన రైతులకు మొంథా తుపాను తీవ్ర నష్టాన్ని తెచ్చి పెట్టింది. రెండు రకాలుగా నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాల్సిన ప్రభుత్వం ఆంక్షలు విధించడంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి.

పంట నష్టానికి కోత

- 'మొంథా' ప్రభావంతో 5,583 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు
- 33 శాతం నిబంధన పేరుతో కుదింపు
- అధికారులు పంపింది 4,234 ఎకరాలే
- జాబితాలో నోచుకోని బొప్పాయి, అరటి పంట

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

మొంథా తుపాను ప్రభావంతో జిల్లాలో తుపాను ప్రభావంతో జిల్లాలో సుమారు 5,582.98 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. అందులో జిల్లాలో వరి పంటకు సంబంధించి 4,801 మంది రైతులకు చెందిన 5,568.75 ఎకరాల్లో వరి పంట దెబ్బతింది. జిల్లాలో 13 మండలాల పరిధిలోని 120 గ్రామాల్లో పంటనష్టం సంభవించినట్లు అధికారులు గుర్తించారు. పత్తి పంట సుమారు 13 ఎకరాల్లో దెబ్బతింది. ఇచ్ఛాపురం, పాతపట్నం, నందిగాం, వజ్రపుకొత్తూరు, ఎచ్చెర్ల మండలాల్లో వరి, కొత్తూరు మండలంలో పత్తి పంటకు నష్టం వాటిల్లినట్లు గుర్తించారు. తుపాను, ఈదురు గాలుల కారణంగా ఉద్యాన పంటలకు 14.23 ఎకరాల మేర నష్టం వాటిల్లింది. అందులో 28 ఎకరాల్లో జీడి, 1.12ఎకరాల్లో అరటి, ఎకరా విస్తీర్ణంలో బొప్పాయి, ఐదు ఎకరాల్లో కూరగాయలు, పంటలకు నష్టం సంభవించింది.

అధికారులు పంపిన నష్టం వివరాలు ఇలా...

అధికారులు పంపిన పంట నివేదిక ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. వ్యవసాయ, ఉద్యాన పంటలు కలిపి మొత్తం 4,234.33 ఎకరాల్లో నష్టం వాటిల్లినట్లు సంబంధితశాఖల అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. అందులో వ్యవసాయ పంటలు 4,205 ఎకరాల్లో దెబ్బతిన్నట్లు పేర్కొన్నారు. అందులో వరి పంటకు 4,302.5 ఎకరాల్లో నష్టం వాటిల్లినట్టు పొందుపరిచారు. పత్తి పంట 165 ఎకరాల్లో దెబ్బతిన్నట్లు నివేదించారు. చెరుకు, మొక్కజొన్న తదితర పంటలు కలిపి మూడు ఎకరాల్లో నష్టం జరిగినట్టు పేర్కొన్నారు. ఉద్యాన పంటలకు సంబంధించి మొత్తం 29.33 ఎకరాల్లో దెబ్బతినట్టు పంట నష్టం తుది జాబితాలో పేర్కొన్నారు. అందులో అందులో జీడి పంట 18.83 ఎకరాల్లో, కూరగాయ పంటలు 10.5 ఎకరాల్లో నష్టం వాటిల్లినట్టు పొందుపరిచారు. ప్రాథమిక నివేదికలో 1.12 ఎకరాల్లో అరటి, ఎకరా విస్తీర్ణంలో బొప్పాయి పంట దెబ్బతిన్నట్టు పేర్కొన్నా తుది జాబితాలో సున్నాగా నమోదు చేశారు.

రంగు మారిన ధాన్యం కొనుగోలుపై రాని స్పష్టత

2025 ఖరీఫ్‌లో అన్ని రకాల పంటలు కలిపి 4,7,488 ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేస్తారని అంచనా వేయగా, 4,2,600 ఎకరాల్లో పంటలు వేయగలిగారు. వరి పంట సాగు లక్ష్యం 3,76,773 ఎకరాలు కాగా, 3,69,304 ఎకరాల్లో సాగైంది. మొక్కజొన్న కూడా దాదాపు 87 శాతం మేర సాగైంది. పంట చేతికొస్తున్న సమయంలో మొంథా తుపాను రైతులను నిండా ముంచింది. పంట నష్టం 33 శాతం దాటితేనే పరిహారం చెల్లిస్తామని ప్రభుత్వం చెప్పడంతో అంతకు తక్కువ నష్టం వాటిల్లిన చోట రైతులు అన్ని రకాలుగా నష్టపోయే అవకాశం ఉంది. నాలుగు రోజులుగా వరి చేలు నీటిలోనే నానిపోవడంతో ధాన్యం రంగు మారడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. రంగు మారిన ధాన్యం కొనుగోలు, తేమ శాతం పెంపు తదితర అంశాలపై పరిశీలిస్తామని ఇటీవల జెడ్‌పిలో నిర్వహించిన డిఆర్‌సి సమావేశంలో వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రకటించారు. మరి కొద్ది రోజుల్లో ధాన్యం కొనుగోలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఇప్పటివరకు వీటిపై స్పష్టమైన ఆదేశాలు రాకపోవడంపై రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

సిక్కోలు పుస్తక మహోత్సవానికి వేళాయే

ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న సిక్కోలు పుస్తక మహోత్సవం మరికొద్ది గంటల్లో మొదలు కానున్నాయి. జిల్లాలో తొలిసారి నిర్వహిస్తున్న వేడుకలకు శ్రీకాకుళం నగరంలోని స్థానిక ఎన్‌టిఆర్ మున్సిపల్ హైస్కూల్ మైదానం ముస్తాబైంది. మంగళవారం నుంచి ప్రారంభం కానున్న వేడుకలు ఈ నెల 20 వరకు కొనసాగనున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వందకు పైగా ప్రచురణ సంస్థలు రానున్నాయి. వేలాది పుస్తకాల ప్రదర్శనతో పాటు అమ్మకాలు సాగించనున్నాయి. పుస్తక మహోత్సవాల్లో భాగంగా రోజూ సాయంత్రం సాంస్కృతిక, వైజ్ఞానిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. విజ్ఞానం, వినోదం ఒకేచోట మేళవించి చేపడుతున్న వేడుకలు పది రోజులు పాటు జిల్లా ప్రజలను కనువిందు చేయనున్నాయి.

- వందకు పైగా ప్రచురణ సంస్థలు రాక
- వేలాది పుస్తకాల ప్రదర్శన, అమ్మకాలు
- రోజూ సాహిత్య, సాంస్కృతిక, వైజ్ఞానిక కార్యక్రమాలు
- నేటి నుంచి 20 వరకు కొనసాగుతున్న వేడుకలు
- ఎన్‌టిఆర్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో ప్రారంభం

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి, అరసవల్లి

శ్రీకాకుళం నగరంలో తొలిసారిగా నిర్వహిస్తున్న పుస్తక మహోత్సవం అందరిలోనూ ఆసక్తి నెలకొంది. వేడుకలపై వివిధ రూపాల్లో విస్తృతంగా ప్రచారం చేయడంతో అంతటా చర్చ సాగుతోంది. సిక్కోలు పుస్తక మహోత్సవం తరలిరండి, విజయవంతం చేయండంటూ అధికారుల చేత ఆవిష్కరణలు చేయించారు. వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడుతో ఆవిష్కరించారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యాన సుమారు రెండు నెలల నుంచి ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో పుస్తక మహోత్సవ కరపత్రాలను అందించారు. నగరంలోని సాంస్కృతిక కళా మండలిలు, సాహితీ వేత్తలు, రచయితలతో కలిసి పుస్తక మహోత్సవం గురించి చర్చించి విస్తృత ప్రచారం నిర్వహించారు. శ్రీకాకుళం నగరంలోని ఎన్‌టిఆర్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో వేడుకలకు సిక్కోలు పుస్తక మహోత్సవ నిర్వహణ కమిటీ ఏర్పాట్లు చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వందకు పైగా ప్రచురణ సంస్థలు, 50 వేల టైటిల్స్‌తో ప్రదర్శనకు, అమ్మకాలకు సిద్ధమవుతున్నాయి.

సాంస్కృతిక, వైజ్ఞానిక కార్యక్రమాలు

పుస్తక మహోత్సవాల్లో భాగంగా రోజూ సాయంత్రం 4 నుంచి రాత్రి పది గంటల వరకు సాహిత్య, సాంస్కృతిక, వైజ్ఞానిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. జిల్లాకు ప్రత్యేకమైన కళారూపాలైన తప్పెటగుళ్ళ, కోలాటం, జముకుల పాట, ఎరుకల పాట వంటి సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. వీటితో పాటు శాస్త్రీయ నృత్యాలు, ఏకపాత్రాభినయాలు, నాటికలు, సినీ సంగీత విభావరులు, సంగీత వాయిద్య విన్యాసాలు సిక్కోలు పుస్తక మహోత్సవంలో ప్రజలను వీనుల విందు చేయనున్నాయి. అదేవిధంగా ఇంజినీరింగ్ మెడిసిన్ డిగ్రీ కళాశాల, జూనియర్ కాలేజీ, ఉన్నత పాఠశాలల విద్యార్థులతో సైన్స్ ప్రయోగాలు ప్రదర్శించనున్నారు. శ్రీకాకుళం జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులచే వైజ్ఞానిక ప్రదర్శనలు, మూఢనమ్మకాలపై ప్రదర్శనలు, మానసికోల్లాసం కలిగించే పలు కార్యక్రమాలు అలరించనున్నాయి. రోజూ సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు జెవివి ప్రతినిధుల ఆధ్వర్యాన విద్యార్థులను ఆకర్షించే వైజ్ఞానిక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నారు. అదేవిధంగా ప్రాంగణలో అల్పాహారం, తాగునీరు, టీ, కాఫీ స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు.

సాహితీ ప్రియులకు శ్రవణానందం

పుస్తకమహోత్సంలో భాగంగా సాహిత్య, పుస్తక ఆవిష్కరణ సభలు నిర్వహించనున్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల కవులు, రచయితలు, రచించిన పుస్తకాలు, కవితలను ఆవిష్కరించనున్నారు. వక్తల ప్రసంగాలు, పుస్తకాల పరిచయ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

నేడు ప్రారంభ సభ

సిక్కోలు మహోత్సవం ప్రారంభ సభ మంగళవారం సాయంత్రం 4.30 గంటలకు నిర్వహించనున్నారు. మహోత్సవాలను ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రారంభించనున్నారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు.

పుస్తక ప్రదర్శనను జయప్రదం చేయాలి

శ్రీకాకుళం ఎన్‌టిఆర్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో ఈ నెల 11 నుంచి 20 వరకు సిక్కోలు పుస్తక మహోత్సం పేరుతో వేడుకలు జరగున్నాయి. పది రోజలు పాటు పుస్తకాల ప్రదర్శన అమ్ముకాలు ఉంటాయి. రోజూ సాయంత్రం 4 గంటల నుంచి సాహిత్య, సాంస్కృతిక, విజ్ఞాన కార్యక్రమాలు ఉంటాయి. అందరూ తరలివచ్చి పుస్తక మహోత్సవాన్ని విజయవంతం చేయాలి. - కె.శ్రీనివాసు, సిక్కోలు పుస్తక మహోత్సవ కమిటీ ప్రతినిధి

ఆందోళన చేస్తున్న కార్మికులు

బకాయి వేతనాలు చెల్లించాలి

శ్రీకాకుళం సిటీ: రిమ్స్ అధికారులు స్పందించి సెక్యూరిటీ సిబ్బంది రెండు నెలల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని సిఐటియు టౌన్ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు డిమాండ్ చేశారు. రిమ్స్ కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన కార్తికేయ సెక్యూరిటీ కాంట్రాక్టరు నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ... రిమ్స్ సెక్యూరిటీ కార్మికులు సోమవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బకాయి వేతనాలు వెంటనే ఎంఒయు ప్రకారం చెల్లించాలన్నారు. వేతనాలు చెల్లించకపోవడంతో ఆకలితో అలమటిస్తున్న కార్మికుల సమస్యపై అధికారులు స్పందించాలన్నారు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో 15 ఏళ్లుగా సెక్యూరిటీ గార్డులుగా సేవలందిస్తున్న వారికి ఈ ఏడాది సెప్టెంబరు, అక్టోబరు వేతనాలు ఇప్పటికీ చెల్లించలేదని అన్నారు. కార్తికేయ సెక్యూరిటి ఏజెన్సీ కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. జూన్, జూలై కార్మికుల పిఎఫ్ కట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యల పరిష్కరించాల్సిన రిమ్స్ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. కొత్త కాంట్రాక్టరు బాధ్యతలు తీసుకుని ఐదు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ కార్మికుల సమస్యలపై యూనియన్‌తో చర్చించలేదన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంపుదల చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో రిమ్స్ యూనియన్ నాయకులు ఎం.సూర్యనారాయణ, ఎం.శ్రీను, జె.వెంకటరమణ, బి.అప్పన్న, జి.లక్ష్మణరావు, టి.శ్రీను, ఎస్.రాజేంద్ర, ఎస్.శ్రీను, జి.బద్రిరావు పి.సతీష్, కృష్ణ, బండారమ్మ, సంతోషి, రాజేశ్వరి, సిహెచ్.పద్మ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణదాస్

సంతకాల ప్రతులు గవర్నర్‌కు అందజేస్తాం

వైసిపి జిల్లా అధ్యక్షులు కృష్ణదాస్

కోటబొమ్మాళి: ప్రభుత్వం మెడికల్ కళాశాలను ప్రైవేటుపరం చేయడాన్ని నిరసనగా సేకరించిన కోటి సంతకాల ప్రతులను గవర్నర్‌కు అందజేస్తామని వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ అధ్యక్షతన మండలంలోని యలమంచిలి, లఖందిడ్డి, గంగరాం పంచాయతీలలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిపిపిని ప్రజలందరూ పెద్ద ఎత్తున వ్యతిరేకించాలని కోరారు. ప్రజల ఓట్లతో ఎన్నో ఏళ్ల గెలిచిన కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు జిల్లాకు చేసిన అభివృద్ధి శూన్యమని విమర్శించారు. టిడిపి అధికారంలోకి వచ్చిన తరువాత ఇస్తామని చెప్పిన సూపర్ సిక్స్ హామీలను విస్మరించారని ధ్వజమెత్తారు. మెడికల్ కళాశాలు ప్రైవేటీకరణతో పేద విద్యార్థులకు తీవ్ర నష్టం విటిల్లుతుందన్నారు. మాజీ సిఎం వైఎస్.జగన్మోహన్‌రెడ్డి హయాంలో రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ పథకాలు అందాయని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు సంపతిరావు హేమసుందరరాజు, జిల్లా ఉపాధ్యక్షులు అన్నెపు రామారావు, ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, దుబ్బ వెంకటరావు, పంచాయతీరాజ్ విభాగ ఉపాధ్యక్షులు నూక సత్యరాజు, పేడాడ వెంకటరావు, వైస్ ఎంపిపి దుక్క రామకృష్ణ, సుంకరి జనార్ధనరెడ్డి, విప్ప బొడ్డు అప్పన్న, కాళ్ల సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

105 పోలింగ్ కేంద్రాలకు ప్రతిపాదన

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ఇసిఐ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో కొత్తగా 105 పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదిస్తున్నామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో, అధికారులతో సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న 2,358 కేంద్రాలకు అదనంగా ఈ కొత్త ప్రతిపాదనలు ఆమోదం పొందితే, మొత్తం కేంద్రాల సంఖ్య 2,463కు చేరుకుంటుందని చెప్పారు. గతంలో తాత్కాలికంగా ఉన్న సహాయక పోలింగ్ కేంద్రాలను శాశ్వత కేంద్రాలుగా మా ర్చడంలో భాగంగా ఈ ప్రతిపాదనలు తయారు చేసినట్లు వివరించారు. జిల్లాలోని పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ (మార్పులు, చేర్పుల ప్రక్రియ) పనులు తప్పనిసరిగా భారత ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారమే చేపట్టాలని అన్నారు. ఈ ప్రక్రియ ఓటర్లకు మెరుగైన సౌకర్యాన్ని అందించే విధంగా ఉండాలని స్పష్టం చేశారు. ఈ మార్పులు, చేర్పుల ప్రక్రియలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో 1200, పట్టణ ప్రాంతాల్లో 1400 కంటే ఎక్కువ ఓటర్లు ఉన్న కేంద్రాలలో రద్దీని తగ్గించడానికి కొత్త కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పోలింగ్ కేంద్రానికి చేరుకోవడానికి ఓటర్లు రెండు కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరం నడవకూడదన్నారు. నదులు, కాలువలు, కొండలు వంటి భౌగోళిక అడ్డంకులు లేకుండా చూడాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలు ప్రభుత్వ, సెమీ-ప్రభుత్వ భవనాల్లో మాత్రమే ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రం మొదటి అంతస్తులో, అంతకంటే ఎత్తులో ఉండరాదని వివరించారు. మైనారిటీలు, ఎస్‌సి, ఎస్‌టి వంటి బలహీన తరగతులు నివసించే ప్రాంతాల్లో, వారు భయం లేకుండా ఓటు వేయడానికి వీలుగా, ఓటర్ల సంఖ్యతో నిమిత్తం లేకుండా కొత్త కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ విషయంలో తనిఖీ అధికారి ప్రత్యేక నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ప్రతిపాదిత 105 కొత్త పోలింగ్ కేంద్రాల్లో శ్రీకాకుళం నియోజకవర్గంలో అత్యధికంగా 45 కేంద్రాలు, ఇచ్ఛాపురం నియోజకవర్గంలో 20 కేంద్రాలు, పలాస 18, ఆమదాలవలస 11, ఎచ్చెర్ల ఏడు, టెక్కలిలో నాలుగు కొత్తగా పోలింగ్ కేంద్రాలు ప్రతిపాదించామని తెలిపారు. నరసన్నపేట, పాతపట్న మండలాల్లో పోలింగ్ కేంద్రాలు పాతవే కొనసాగుతాయని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ మార్పులు, చేర్పుల ప్రక్రియను వేగంగా పూర్తి చేసి, ఇసిఐ ఆమోదం అనంతరం ప్రకటించడానికి సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు జయదేవి, పద్మావతి, రాజకీయ పార్టీల నాయకులు కలమట వెంకట రమణ, పి.ఎం.జె.బాబు, మాదారపు వెంకటేష్, కెవిఎల్ఎస్.ఈశ్వరి, రౌతు శంకరరావు, సురేష్ సింగ్ పాల్గొన్నారు.

బిల్లుల చెల్లింపు, భూసేకరణ సమస్యలు పరిష్కరించాలి

వంశధార ప్రాజెక్టుపనుల్లో జాప్యాన్ని సహించేది లేదని, పెండింగ్‌లో ఉన్న పనులను, ముఖ్యంగా రైతులకు సంబంధించిన భూసేకరణ సమస్యలను తక్షణమే, ప్రాధాన్యతతో పరిష్కరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. వంశధార ప్రాజెక్టు పురోగతిపై కలెక్టరేట్‌లో సమీక్షించారు. నాగావళి ఫ్లడ్ బ్యాంక్ ప్యాకేజీ-2కు సంబంధించిన రూ.1.38 కోట్ల బిల్లుల చెల్లింపు ప్రక్రియ పురోగతిలో ఉందని, అధికారులు భూసేకరణ విషయంలో రైతుల నుంచి వస్తున్న అభ్యంతరాలపై ప్రత్యేక దృష్టిసారించాలని ఆదేశించారు. బూర్జ మండలం తోటవాడ వద్ద 5.84 ఎకరాల భూసేకరణ పెండింగ్‌లో ఉండగా, రైతులు అలైన్‌మెంట్ మార్పుపై వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలపై తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. చిన్నలంకెంలోని 7.02 ఎకరాల ఎండోమెంట్ (దేవదాయ) భూమిని అప్పగించడంలో జాప్యంపై ఆరా తీశారు. సమావేశంలో ఎస్‌డిసి జయదేవి, టెక్కలి ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి, జలవనరుల శాఖ ఎస్‌ఇ పొన్నాడ సుధాకరరావు, వంశధార ఎస్‌ఇ గురుగుబిల్లి రామచంద్రరావు, ఇఇలు ఎం.వి.సీతారాం నాయుడు, బోర రవీంద్ర, మురళీమోహన్, శేఖర్, వెంకట రమణ పాల్గొన్నారు.

పిల్లలను చట్టబద్ధంగా దత్తత తీసుకోవాలి

పిల్లలను చట్ట బద్ధంగా దత్తత తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కలెక్టర్ కార్యాలయంలో తన ఛాంబరులో జాతీయ దత్తత అవగాహన మాసోత్సవాలు సందర్భంగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. పిల్లల దత్తతకు మహిళాభివృద్ధి శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న www.missionvataslya.wcd.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా బాలల రక్షణ అధికారి కె.వి.రమణ, బాలల రక్షణ అధికారి ఐ.లక్ష్మీనాయుడు, శిశు గృహ మేనేజర్ కె.నరేష్, సోషల్ వర్కర్ పి.రాంబాబు పాల్గొన్నారు.

అర్జీలు సత్వర పరిష్కారానికి కృషి

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదికలో వచ్చిన అర్జీల పరిష్కారానికి సత్వరం చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులకు ఆదేశించారు. జెడ్‌పిలో మీకోసంలో భాగంగా సోమవారం ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా 102 అర్జీలు వచ్చాయి. పోలీస్‌శాఖలో ఎంపికైన కానిస్టేబుళ్ల శిక్షణను తక్షణమే ప్రారంభించాలని అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా సమితి ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. 2022 నవంబరులో విడుదలైన కానిస్టేబుళ్ల పోస్టుల నోటిఫికేషన్ ప్రకారం, ప్రిలిమ్స్, ఫిజికల్ టెస్టులు, మెయిన్స్, మెడికల్ పరీక్షల వంటి అన్ని దశలు పూర్తి అయ్యాయని అన్నారు. పోలీస్‌శాఖలో శిక్షణ ప్రారంభం కావాలనే ఆశతో నెలలుగా ఎదురుచూస్తున్నారని అన్నారు. ఈ నియామక ప్రక్రియ ప్రారంభమై నాలుగేళ్లు గడిచినా ఇప్పటికీ శిక్షణ తరగతులు ప్రారంభం కాలేదని వివరించారు. మొంథా తుపాను సహాయాన్ని ఎచ్చెర్ల మండలం పొన్నాడలోని వంద మత్స్యకార కుటుంబాలకు అందజేయలేదుని కనగళ్ల అప్పారావుతో కూడిన బృందం ఫిర్యాదు చేసింఇ. 50 కిలోల బియ్యంతో పాటు ఆరు రకాల సరుకులు మత్స్యకారులకు మిగతా ప్రాంతాల్లో అందజేశారన్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు. కుప్పిలి వరకు ఆర్‌టిసి బస్సు వస్తుందని, దీన్ని బుడగుట్లపాలెం వరకు పెంచాలని కోరారు. గార మండలం ఒప్పంగిలో కోళ్ల ఫారం వల్ల పారిశుధ్య సమస్య తలెత్తుతుందని అన్నారు. ఉపాధి హామీలో పనిచేస్తున్న సాంకేతిక సహాయకులకు మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో కాకుండా, గత పాత పద్ధతిలో వేతనాలు చెల్లించాలని కోరారు. లేదంటే భవిష్యత్‌లో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. అరసవల్లి డివన్ఎపి ఇపిడిసిఎల్ పరిధిలో మీటర్ రీడింగ్ వర్కర్లకు కాంట్రాక్టరు నిబంధనలు మేరకు వేతనం చెల్లించటం లేదని ఫిర్యాదు చేశారు. రూ.13,840 నెలకు వేతనం చెల్లించవల్సి ఉండగా, రూ.11 వేలు చెల్లిస్తున్నారని, కాంట్రాక్టరుపై చర్యలు తీసుకోవాలని కోరారు. 2014-19 మధ్య నీరు-చెట్టు బకాయి బిల్లులు చెల్లించాలని మాజీ ఎచ్చెర్ల మండలం ఇబ్రహింబాద్‌కు చెందిన మాజీ సర్పంచ్ సీపాన ఎర్రన్నాయుడు ఫిర్యాదు చేశారు. పాఠశాలల్లో మార్షల్ ఆర్ట్స్ శిక్షకులను రూ.మూడు వేలు వేతనానికి నియమిస్తున్నారని అన్నారు. పొందూరు మండలం కింతలికి చెందిన కిల్లి రాజులమ్మ మొంథా తుపాను సమయంలో ఇల్లు పడిపోయిందని, ఆర్థికంగా ఆదుకోవాలని వినతిపత్రం అందజేశారు. పింఛన్లు, భూ సమస్యల పరిష్కారానికి ఎక్కువగా ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్‌కుమార్, ఇన్‌ఛార్జి జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మణమూర్తి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు పద్మావతి, జి.జయదేవి, డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్‌లు పాల్గొన్నారు.

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

అనుకున్నట్టే అయింది!

కవిటి వద్దంటున్న వైద్యులు

ప్రజాశక్తి- కవిటి

కవిటి సిహెచ్‌సి

అనుకున్నట్టే అయింది. రవాణాకు అనుకూలంగా ఉంటూ అధిక జీతాలు ఇచ్చే సిహెచ్‌సిలు వదులుకుని మారుమూల ప్రాంతమైన కవిటి తాము ఎందుకు రావాలనే ఆలోచన వైద్యుల్లో కలుగుతోంది. గిరిజన ప్రాంతాల్లో సేవలందించే వైద్యులకు 50 నుంచి 30 శాతం జీతాలు పెంచుతూ ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన ఉత్తర్వుల జాబితాలో కవిటి సిహెచ్‌సి లేదు. కిడ్నీ ప్రభావిత ప్రాంతమైన కవిటిపై ఈ నిర్ణయం తీవ్రమైన ప్రభావం చూపిస్తోందని 'ప్రజాశక్తి' సెప్టెంబరు 28న 'కవిటిపై చిన్నచూపేలా?' అంటూ కథనం ప్రచురించింది. ఆ వార్త నిజం చేస్తూ ఆదివారం స్పెషలిస్టు వైద్యుల నియామకంలో ఒక్కరూ కవిటిలో చేరేందుకు మొగ్గు చూపలేదు. చివరకు ఆ వైద్యుల్లో కవిటి మండలానికి చెందిన వ్యక్తి ఉన్నా అతనూ సోంపేట కోరుకోవడం ఆ జీవో ప్రభావానికి అద్దం పడుతోంది. ప్రభుత్వ సెకండరీ ఆస్పత్రుల్లో స్పెషలిస్టు వైద్యుల కొరత తీర్చేలా పీజీ పూర్తి చేసిన 227 మంది వైద్య నిపుణులను 142 సెకండరీ ఆస్పత్రులకు ప్రభుత్వం కేటాయించింది. మొత్తం 227 మందిలో 35 మంది గైనకాలజిస్టులు, జనరల్ మెడిసిన్ స్పెషలిస్టులు, 30 మంది జనరల్ సర్జన్ వైద్యులు, 26 మంది మత్తు వైద్యులు, 25 మంది పిల్లల వైద్య నిపుణులు, 18 మంది ఎముకల వైద్యులు, 17 మంది రేడియాలజిస్టులు, 15 మంది కంటి వైద్యనిపుణులు, 9 మంది చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణులను ప్రభుత్వం ఆయా ఆస్పత్రుల్లో కేటాయించింది. వాస్తవానికి కవిటి సిహెచ్‌సిలో ప్రస్తుతం జనరల్ మెడిసన్, జనరల్ సర్జన్, ఎనస్థీషియా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటితో పాటు కిడ్నీ ప్రభావిత ప్రాంతమైన కవిటి సిహెచ్‌సికి ఒక నెఫ్రాలజీ పోస్టు మంజూరు చేయాలని ఇటు ప్రజలు, అటు ప్రజా ప్రతినిధులు ఎప్పటి నుంచో కోరుతున్నారు. ఇవన్నీ పక్కన పడేసి ఎవరు ఎక్కడ కోరితే అక్కడ పోస్టింగులు ఇచ్చిన ఉన్నతాధికారులు కవిటి సిహెచ్‌సిపై మరోసారి సీతకన్నేశారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించకపోతే భవిష్యత్‌లో ఇక్కడకు వచ్చేవారు కరువవుతారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడలు మంత్రిత్వశాఖ మీరా యువ భారత్ సౌజన్యంతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల (పురుషులు) మైదానంలో క్లస్టర్ లెవల్ స్పోర్ట్స్ మీట్ రన్నింగ్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, షటిల్ క్రీడలు సోమవారం నిర్వహించారు. ఈ క్రీడా పోటీలను జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ జి.వేంకటేశ్వరరావు, ఆర్ట్స్ కళాశాల పిఇటి జ్యోతికుమార్ ప్రారంభించి మాట్లాడుతూ క్రీడా సంస్కృతిని ప్రోత్సహించడానికి, అట్టడుగు స్థాయిలో ప్రతిభావంతులైన యువ క్రీడాకారులను గుర్తించడానికి ప్రభుత్వాలు, క్రీడా సంస్థలు ఈ పోటీలను నిర్వహిస్తున్నాయని అన్నారు. యువతలో ఫిట్‌నెస్, క్రీడల సంస్కృతిని పెంపొందించడం, గ్రామీణ, స్థానిక ప్రాంతాల నుంచి కొత్త క్రీడా ప్రతిభను వెలికితీయడం ఈ క్రీడల ప్రధాన లక్ష్యమని అన్నారు. క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులకు మంగళవారం సాయంత్రం అతిథులు చేతులు మీదుగా బహుమతులు ప్రదానం చేయనున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్లస్టర్ లెవెల్ స్పోర్ట్స్ మీటులో గెలుపొందిన క్రీడాకారులకు జిల్లా స్థాయిలో నిర్వహించి క్రీడాపోటీలకు పంపిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో క్రీడాకారులు యువతీ యువకులు, తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ అడుతున్న యువత

ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్‌పి మహేశ్వరరెడ్డి

అర్జీల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి

ఎస్‌పి కె.వి మహేశ్వరరెడ్డి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

జిల్లా ప్రజల సమస్యలు, ఫిర్యాదులు తెలుసుకుని వాటిని తక్షణ పరిష్కారం కల్పించేందుకు జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కార కార్యక్రమాన్ని ఎస్‌పి కె.వి. మహేశ్వర రెడ్డి సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ ఫిర్యాదులను ఎస్‌పికి నేరుగా అందజేశారు. ప్రతి ఫిర్యాదును శ్రద్ధగా విని సంబంధిత పోలీసు అధికారులకు ఆయా ఫిర్యాదులు పరిష్కారంపై ఫోన్ ద్వారా దిశానిర్దేశాలు ఇచ్చి తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. 53 పిర్యాదులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం పోలీసు శాఖకు అత్యంత ప్రాధాన్యం అని ప్రతి పోలీస్ అధికారి ప్రజా ఫిర్యాదులపై బాధ్యతగా వ్యవహరించి, పరిష్కార చర్యలు చేపట్టి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా ఫిర్యాదులపై తీసుకున్న చర్యలు నివేదిక రూపంలో జిల్లా పోలీసు కార్యాలయంలో అందజేయాలని స్పష్టం చేశారు.

ఆందోళన చేస్తున్న గిరిజనులు

విద్యుత్ బిల్లులు తగ్గించాలి

కొత్తూరు: గిరిజన ప్రాంతాల్లో విద్యుత్ అధిక బిల్లు అధికంగా వసూళ్ల చేస్తున్నారని, దీనిని తక్షణమే ప్రభుత్వం రద్దు చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సిర్ల ప్రసాద్ డిమాండ్ చేశారు. స్థానిక విద్యుత్‌శాఖ కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇరపాడుగూడ గిరిజన ప్రాంతాల్లో విద్యుత్ అధిక బిల్లులు వల్ల ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్‌శాఖ అధికారులు జోక్యం చేసుకుని గిరిజన ప్రాంతాల్లో ప్రజానీకంపై భారాన్ని మోపే విద్యుత్ బిల్లులు వసూళ్ళ ఆపాలన్నారు. అనంతరం పాతపట్నం డివిజన్ విద్యుత్‌శాఖ డిఇ జి.హెచ్.ఎస్.ఎస్.వి. ప్రసాద్, ఎఇ కె.లక్ష్మణరావు, జెఇ నిరంజన్‌కుమార్‌లను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్న, సిఐటియు నాయకులు పనస రమేష్, గిరిజన సంఘం నాయకులు సవర ముఖలింగం, గౌతమి బుద్దుడు, బోగేష్ కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

జియోట్యాగింగ్ చేస్తున్న అధికారులు

నూతన గృహాలకు జియోట్యాగింగ్

మెళియాపుట్టి: మండలంలో ప్రభుత్వం నూతనగృహాల నిర్మాణాలకు చేపట్టిన సర్వే కార్యక్రమంలో భాగంగా మండలంలోని మర్రిపాడు-సిలో సోమవారం హౌసింగ్ అధికారులు జియో ట్యాగింగ్ నిర్వహించారు. లబ్ధిదారులు తమ ఆధార్ కార్డు, ఉపాధి హామీ (జాబ్) కార్డు, బ్యాంకు అకౌంట్ పాస్‌బుక్ జిరాక్స్ కాపీలతో సిద్ధంగా ఉండాలని సూచించారు. లబ్ధిదారులు తప్పనిసరిగా తమ ఖాళీ స్థలం వద్ద హాజరై, అధికారులు తీసే ఫొటోలు, వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయనున్నట్టు పేర్కొన్నారు. ఈ సర్వే వారం రోజుల పాటు కొనసాగుతుందన్నారు. కొత్తగా ఇళ్ల కట్టాలనుకుంటున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ కె.గణేష్, సర్పంచ్ రవ్వల అనురాధ గణపతిరావు, హౌసింగ్ సిబ్బంది

పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

మధ్యాహ్న భోజనం పరిశీలన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలో ఈదుపురంలో ఒరియా ప్రైమరీ స్కూల్, తెలుగు ప్రైమరీ స్కూల్, తిప్పనపుట్టుగా తెలుగు ప్రైమరీ స్కూళ్లలో అమలవుతున్న డొక్కాసీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం అమలు తీరును టిడిపి యూత్ ప్రెసిడెంట్ బోర యువరాజు, జనసేన నాయకులు సంజయ్‌రౌలో సోమవారం పరిశీలించారు. భోజన పథకం మెనూ ప్రకారం ఇస్తున్నారో? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మధు బెహరా, చిత్రో బెహరా, రాజు బెహరా, అంబటి వరంబు, అంబటి రాజయ్య, దువ్వ. ప్రశాంత్, దూపాన శాంబమూర్తి, దూపాన సుబ్బ, అంబటి ధర్మేంద్ర, అంబటి జోగారావు, తిప్పన. సుమన్ పాల్గొన్నారు.

రవిశంకర్ గుప్తాకు అభినందనలు

రవిశంకర్ గుప్తా

పలాస: ఏపి రాష్ట్ర కళింగ కోమటి, కళింగ వైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సభ్యునిగా పలాసకు చెందిన టంకాల రవిశంకర్ గుప్తా నియమించారు. ఈయన జీడి ఉత్పత్తిదారుల సంఘం కార్యదర్శిగా పనిచేస్తున్నారు. గతంలో జిల్లా వాణిజ్య విభాగ అధ్యక్షునిగా కొనసాగారు. తనకు పదవి రావటంపై కృషి చేసిన కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గౌతు శిరీష, నియోజకవర్గ సమన్వయకర్త వెంకన్నచౌదరిలకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామని తెలిపారు.

ఎంపిడిఒగా బాధ్యతల స్వీకరణ

శ్రీకాకుళం సిటీ: గార ఎంపిడిఒగా సురవజల శ్రీనివాసులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎల్ఎన్ పేట మండలంలో డిప్యూటీ ఎంపిడిఒగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై గార వచ్చారు. సిబ్బంది అభినందించారు. మండల ప్రగతి లక్ష్యంగా పనిచేస్తానని, అందరి సహకారంతో ముందుకు సాగుతామన్నారు.

స్వచ్ఛతతోనే ఆరోగ్యం

శ్రీకాకుళం సిటీ: స్వచ్ఛతతోనే ఆరోగ్యం సాధ్యమని కాకినాడ ఆదిత్య కళాశాల ప్రిన్సిపాల్ ఎన్‌వి వేణుగోపాల్ అన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా పట్టణంలో పారిశుధ్యంపై అవగాహన ర్యాలీ సోమవారం నిర్వహించారు. ప్లాస్టిక్ వినియోగం వద్దని సూచించారు. పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు కృషి చేయాలన్నారు.

కదులుతున్న కంకర... తరుగుతున్న కొండ

- చూసివెళ్లిన మైన్స్ అధికారులు
- ప్రభుత్వ ఆదాయానికి గండి

ప్రజాశక్తి- పలాస

కొండ రోజురోజుకూ తరిగిపోతుంది. కంకర అక్రమంగా తరలిపోతుంది. అయినా అధికారులు తమకేమీ సంబంధం లేనట్లు వ్యవహరిస్తుండం సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. రాత్రి, పగలు తేడా లేకుండా లక్షలు విలువ చేసే కంకర తరలిపోతుండడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతంది. ఒక వ్యాపారి తన సొంత స్థలంలో రూ.లక్షలు విలువ చేసే కంకరను అక్రమంగా తరలించి ప్రొక్లెయినరుతో చదును చేసుకోవడంతో కొంత మంది ఫిర్యాదు చేయడంతో మైన్స్ అధికారులు వచ్చి స్థలం చూసి వెనుదిరిగారు. జరిగి మూడు రోజులు కావస్తున్నా... ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై పలువురు పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కంకర తవ్వకాలు జరుపుతున్నాయా? లేదా? చూడాల్సిన బాధ్యత రెవెన్యూ, మైన్స్ అధికారులపై ఉంది. కానీ, ఒక వ్యక్తి పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు చేయడం వల్ల మైన్స్ అధికారులు పరిశీలనకు వస్తున్నారంటే మైన్స్ అధికారుల పనితీరు ఏలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

అక్రమంగా కంకర తరలింపు

మండలంలోని రాజగోపాలపురం, సున్నాడ రెవెన్యూ పరిధిలో కంకర కొండలు ఉన్నాయి. కంకర తువ్వేందుకు రెవెన్యూ, మైన్స్ అధికారులు నుంచి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. ప్రభుత్వానికి రుసుం చెల్లించాల్సి ఉంటుంది. కానీ, పలాస మండలంలో ఉన్న కంకర మాఫియాకు ప్రభుత్వ అనుమతులతో పని లేదు కొండ ఉంటే చాలు. ఎవరు లేని సమయంలో భారీ యంత్రాలతో కొండను తొలిచి ట్రాక్టర్ల

తరలిస్తున్న కంకర

ద్వారా అక్రమంగా తరలిస్తున్నారు. ట్రాక్టర్ లోడ్ సుమారు రూ.500 నుంచి రూ.700 వరకు డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో కంకర మాఫియా పెట్టుబడి లేకుండా కాసులు సంపాదించుకుంటున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతుంది. కొండ తవ్వి కంకరను అక్రమంగా తరలిస్తున్నా రెవెన్యూ, మైన్స్ అధికారులు తమకేమీ సంబంధం లేనట్లు వ్యవహరిస్తుండం సర్వత్రా విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి.

మండలంలోని కంబిరిగాం రెవెన్యూ పరిధిలో 33/1 సర్వే నంబరులో సుమారు 59 సెంట్లు సొంత స్థలాలకు ఒక వ్యాపారి రూ.లక్షలు విలువ చేసే కంకరను అక్రమంగా తరలించారు. సుమారు మూడు అడుగుల ఎత్తులో కంకర వేయడంతో కొంత మంది అక్రమంగా కంకర తరలించి సొంత పొలంలో వేసుకుంటున్నారని అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో మైన్స్ అధికారులు స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి వ్యాపారి స్థలం వద్దకు వెళ్లి చూశారు... వెళ్లారు.

ఈ ఘటనా జరిగి మూడు రోజులు కావస్తున్నా వ్యాపారి పై ఎటువంటి చర్యలు తీసుకోలేదని తెలుస్తోంది. కేవలం స్థలంలో ఉన్న కంకరను కొలతలు వేసి చూసి వెళ్లిపోయారే తప్ప ఎటువంటి అపరాధ రుసుం వసూలు చేయలేదని తెలుస్తోంది. ఇదిలా ఉండగా అపరాధ రుసుం తగ్గించే విధంగా చూడాలంటూ వ్యాపారి మైన్స్ అధికారులతో చీకటి ఒప్పందాలు కుదుర్చుకున్నారని, ఇప్పటికే బారీ స్థాయిలో చేతులు మారినట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. ఇదిలా ఉండగా వ్యాపారి చదును చేస్తున్న ప్రాంతంలో గెడ్డ పోరంపోగు ఉన్నట్లు అధికారులు గుర్తించినా ఇప్పటి వరకు రెవెన్యూ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. వ్యాపారికి అండగా నిలిచేందుకు నోటీసులు ఇవ్వాలి. నిజంగా కంకర తరలించరా? లేదా? వ్యాపారి వద్ద బిల్లులు ఉన్నాయా? లేవా? ఎన్ని సెంట్లులో కంకర వేశారు. తదితర అంశాలను అడిగి అనంతరం అపరాధ రుసుం వసూలు చేయాల్సి ఉంటుందని మైన్స్ అధికారులు చెబుతుండడం గమనార్హం. ఒక వైపు మైన్స్ అధికారులు 23 సెంట్లని చెబుతుండగా, మరోవైపు రెవెన్యూ అధికారులు 59 సెంట్లని చెబుతున్నారు.

ఇదే విషయంపై టెక్కలి మైన్స్ ఎడి విజయలక్ష్మిను వివరణ కోరగా, పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు రావడంతో ఒక వ్యక్తి సొంత స్థలంలో వేసిన కంకరను చూసేందుకు రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించామన్నారు. మైన్స్ నిబంధనలు ప్రకారం ముందుగా నోటిసులు ఇచ్చి చర్యలతో పాటు అపరాధ రుసుం వసూలు చేస్తున్నామని వివరణ ఇచ్చారు.

ఆమదాలవలస : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాగమణి తదితరులు

సిక్కోలు పుస్తక మహోత్సవాన్ని విజయవంతం చేయాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు నాగమణి

ప్రజాశక్తి- ఆమదాలవలస

సిక్కోలు పుస్తక మహోత్సవంలో ప్రతిఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు కె.నాగమణి పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రం వద్ద వ్యవసాయ పరిశోధన స్థానం కాంట్రాక్టు సిబ్బందితో కలిసి సిక్కోలు పుస్తక మహోత్సవం పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 11 నుంచి 20 వరకు జిల్లా కేంద్రంలోని ఏడురోడ్ల జంక్షన్ వద్ద నున్న ఎన్‌టిఆర్ మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్స్‌లో జరగనున్న సాహిత్య, సాంస్కృతిక వైజ్ఞానిక సంబరాలు సిక్కోలు పుస్తక మహోత్సవానికి జిల్లాలోని ప్రజలందరూ విచ్చేసి విజయవంతం చేయాలన్నారు. మంగళవారం సాయంత్రం 4.30 గంటలకు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండర్కర్, ఎమ్మెల్యే గొండు శంకర్ చేతులమీదుగా ప్రారంభోత్సవం జరుగునని తెలిపారు. వందలాది బుక్‌స్టాల్స్ పుస్తక ప్రియులకు ఆనందాన్నిస్తాయని, విద్యార్థులు, పెద్దలు విజ్ఞానాన్ని అందించే పుస్తకాలను పుస్తక మహోత్సవంలో కొనుగోలు చేసేందుకు ముందుకు రావాలన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లోని కవులు, రచయితలు రచించిన పుస్తకాలు, కవితలు ఆవిష్కరణలు, పరిచయాలు, సమీక్షలు నిర్వహించబడతాయన్నారు. జిల్లాకు సంబంధించిన పలు విశిష్టమైన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడతాయన్నారు. పోస్టర్ ఆవిష్కరణలో వ్యవసాయ పరిశోధనాస్థానం కాంట్రాక్ట్ సిబ్బంది చిట్టిబాబు, గణపతి, సూరి, త్రివేణి, సునీత పాల్గొన్నారు.

టెక్కలి : సిక్కోలు పుస్తక మహోత్సవ సందర్భంగా కార్యక్రమం విజయవంతం చేయాలని కోరుతూ జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యాన పోస్టర్‌ను ఆవిష్కరించారు. జిల్లా కేంద్రంలో 9 రోజుల పాటు నిర్వహించే ఈ పుస్తక మహోత్సవంలో భాగంగా వివిధ కవులు, రచయితలు రాసిన పుస్తకాలతో పాటు సుమారు వంద వరకు పుస్తక దుకాణాలు ఏర్పాటు చేయనున్నారని జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి కుప్పిలి కామేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు లక్ష్మణరావు, తిర్లంగి రాజేష్, యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు కురమాన దాలయ్య, పిఆర్‌టియు నాయకులు జర్జాన బాబూరావు, రామచంద్రరావు, మాధు, సూర్యప్రకాష్, కె.కె.రామిరెడ్డి, టైల్స్ వెంకటరమణమూర్తి, నగేష్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో సత్తాచాటిన మాధురి

ప్రజాశక్తి- బూర్జ

రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్ పోటీల్లో ఒవిపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన ఏడవ తరగతి విద్యార్థిని గెరడా మాధురి విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి రేసింగ్ పోటీలో మూడవ స్థానం సాధించింది. మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చదువుతో పాటు క్రీడలను అలవర్చుకోవాలని ప్రధానోపాధ్యాయురాలు ధర్మాన కృష్ణవేణి తెలిపారు. అలాగే మాధురికి విద్యార్థులు, గ్రామ ప్రజలు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

సింగపూర్‌కు ఉత్తమ ఉపాధ్యాయులు

ప్రజాశక్తి- అరసవల్లి

విద్యా విధానంలో నూతన సంస్కరణలు తీసుకొచ్చేందుకు ఈ నెల 27 నుంచి విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ విద్యావిధానాన్ని పరిశీలించనున్నారు. ఆయనతో పాటు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు 72 మంది వెళ్లనున్నారు. అందులో భాగంగా శ్రీకాకుళం నుంచి ఎన్.టి.ఆర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న నీరజా సుబ్రమణ్యం ఉన్నారు. వీరికి సంబంధించిన వీసాలు సిద్ధం చేయాలని ఉన్నతాధికారులు కోరారని, ఆ మేరకు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈమెతో పాటు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు తీసుకున్న యశోదా లక్ష్మి, జి.సిగడాం మండలం నుంచి అరుణ తదితరులు పాల్గొననున్నారు.

మహిళా భద్రతకు ప్రాధాన్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

మహిళా భద్రతకు ప్రాధాన్యత నిస్తున్నట్లు ఎస్‌పి కె.వి మహేశ్వరరెడ్డి చెప్పారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా శ్రీకాకుళం మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన బి.నారీమణి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌పిని కలిసి పుష్ప గుచ్చం అందజేశారు. మహిళాభద్రత, మహిళలకు సంబంధించిన కేసుల పరిష్కారంలో బాధ్యతగా, నిబద్ధతతో పనిచేయాలని ఎస్‌పి సూచించారు. శక్తి యాప్, నారీ శక్తి కార్యక్రమాలు నిర్వహించి మహిళా భద్రతపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలన్నారు.

వర్చువల్‌గా సిఎం శంకుస్థాపన

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ఎచ్చెర్ల నియోజకవర్గం పైడిభీమవరంలో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌కు సిఎం నారా చంద్రబాబు నాయుడు మంగళవారం వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ ది నకర్ పుండ్కర్ ప్రకటనలో తెలిపారు. జిల్లాకు సంబంధించి ఎచ్చెర్ల నియోజకవర్గం రణస్థలం మండలం పైడిభీమవరంలో రూ.1.99 ఎకరాల్లో రూ.14.60 కోట్లతో నిర్మించనున్నట్లు వివరించారు.

మాట్లాడుతున్న సోమేశ్వరరావు

ధ్యానం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

ధ్యానం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి తక్షణం ధాన్యం కొనుగోలు చేయాలని, తేమ శాతాన్ని పెంచాలని జిల్లా రైతు సంఘం కమిటీ సభ్యులు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. టెక్కలి మండలం రైతు మహాసభ సోమవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో బమ్మిడి సోమేశ్వరరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా కూటమి ప్రభుత్వంలో ఎరువులు సకాలంలో దొరక్క రైతులు అల్లాడిపోయారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాల వల్ల రైతులు నష్టపోతున్నారని అన్నారు. వ్యవసాయ నల్ల చట్టాలు రద్దు చేయాలని, జీడి పంటకు మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించాలన్నారు. వంశధార ప్రాజెక్టును పూర్తి చేసి అటు ఇచ్ఛాపురం వరకు, ఇటు చివర భూములకు నీరు అందించాలని, పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. భూ రీ సర్వేను చేపట్టి సాగు రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా రైతు మహాసభలు ఈ నెల 15, 16 తేదీల్లో టెక్కలిలో నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా టెక్కలి మండల రైతు సంఘం అధ్యక్షునిగా ఇప్పిలి మల్లేశ్వరరావు, ఉపాధ్యక్షునిగా బొడ్డేపల్లి మల్లయ్య, బమ్మిడి సోమేశ్వరరావు, నెయ్యల కృష్ణారావు, కార్యదర్శిగా బగాది వాసుదేవరావు, సహాయ కార్యదర్శిగా పెద్దింటి లచ్చయ్య, బగాది కృష్ణారావు, దారపు సన్యాసి, మరో ఏడుగురు కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

ఆమదాలవలస : గడచిన కొన్నేళ్లుగా మున్సిపాలిటీలో అభివృద్ధి కార్యకలాపాలు నిలిచిపోయాయని, మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కూన రవికుమార్ తెలిపారు. సోమవారం పట్టణంలోని 17వవార్డు పూజారి పేటలో సాయన్న క్వార్టర్స్, తహశీల్దార్ కార్యాలయం తదితర ప్రాంతాల్లో జరుగుతున్న పలు అభివృద్ధి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గడచిన వైసిపి పాలనలో పట్టణం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని, వార్డుల్లో రహదారులు గోతులమయమై ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. డ్రైనేజీ వ్యవస్థ శిథిలమై మురుగు నీరు రహదారులపై ప్రవహించే పరిస్థితి నెలకొందని, ఈ దుస్థితిని మార్చాలని కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే నిర్ణయించడం జరిగిందన్నారు. మున్సిపాలిటీ నిధులతో పాటు పలు మ్యాచింగ్ గ్రాంట్లను తీసుకువచ్చి పలు సిసి రహదా

అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

రులు, డ్రైనేజీల నిర్మాణాలకు సమకూర్చినట్లు తెలిపారు. ప్రజల సౌకర్యార్థం చేపట్టిన ఈ అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పూర్తిచేయాలని గుత్తేదారులను ఆదేశించారు. ఈ పర్యటనలో ఎమ్మెల్యే రవికుమార్ స్కూటీపై పలు ప్రాంతాలను సందర్శించారు. ఆయనతో జనసేన కన్వీనర్ పేడాడ రామ్మోహన్, టిడిపి నాయకులు కూన ఆంజనేయులు, పివికె రాజు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

సర్వే చేస్తున్న అధికారులు

అంగన్వాడీ స్థలం అప్పగింత

పొందూరు: మండలంలోని కొంచాడలో అంగన్వాడీ స్థలం సరిహద్దులను రెవెన్యూ అధికారులు గుర్తించి సంబందిత శాఖ అధికారులకు సోమవారం అప్పగించారు. గ్రామంలోని సచివాలయం ఎదురుగా సర్వే నెంబర్ 45-22 ఎల్‌పిఎం నెంబర్ 953లో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని గత నెల 31న అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు కూల్చివేసి శిథిలాలను తరలించిన విషయం పాఠకులకు విధితమే. దీనిపై కార్యదర్శి, విఆర్ఒ, ఐసిడిఎస్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆ ప్రదేశాన్ని పరిశీలించిన ఐసిడిఎస్ అధికారులు కూల్చివేసిన ప్రదేశంలో తమ కేంద్రం సరిహద్దులను గుర్తించి తమ స్థలాన్ని అప్పగించాలని కోరుతూ రెవెన్యూ అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. సోమవారం రెవెన్యూ, సచివాలయం అధికారులు కూల్చివేసిన ప్రదేశంలో సర్వేజరిపి సరిహద్దులను గుర్తించి ఆ శాఖ అధికారులు అప్పగించారు. సరిహద్దులను గుర్తించిన ప్రదేశంలో అంగన్వాడీ స్థలం పేరుతో బోర్డును ఏర్పాటు చేశారు. సిడిపిఒలు సత్యశ్రీ, ఎస్.అనూరాధ, కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, విఆర్ఒ ప్రకాశరావు, సూపర్‌వైజర్ జి.సుజాత, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

ప్రజాశక్తి- నరసన్నపేట

దివ్య (ఫైల్)

మండలంలోని జమ్ము పంచాయతీ గడ్డయ్యపేటకు చెందిన దివ్య ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతుంది. తన తండ్రి మద్యానికి బానిసై నిత్యం ఇంట్లో ఆమె తల్లితో గొడవలు పడుతుండేవాడు. దీంతో మనస్తాపానికి చెందిన దివ్య తన తండ్రిని భయపెట్టేందుకు ఈ నెల 9న పురుగుల మందు తాగింది. పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు శ్రీకాకుళంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స అనంతరం దివ్యను తన ఇంటికి తీసుకొచ్చారు. సోమవారం దివ్య ఆరోగ్య పరిస్థితి కాస్త ఇబ్బందికరంగా మారడంతో మరలా శ్రీకాకుళం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందింది. ఎస్ఐ దుర్గాప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- నరసన్నపేట

మండలం కోమర్తి 16వ నంబరు జాతీయ రహదారిపై సోమవారం కారును ఢీకొన్న ప్రమాదంలో ప్రమాదంలో వ్యక్తి మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కోమర్తి జాతీయ రహదారిపై ఓ కారు మరమ్మతులకు గురైంది. పెద్దపాడులో పనిచేస్తున్న మెకానిక్ కోరాడ వెంకటేష్‌కు కారు యజమాని సమాచారం ఇచ్చారు. అక్కడకు చేరుకుని కారును మరమ్మతులు చేస్తుండగా... అదే రోడ్డులో వెనుక మరో కారు వచ్చి బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకటేష్ తీవ్రంగా గాయపడి మృతి చెందారు. మరో ముగ్గురు గాయపడినట్లు స్థానికులు చెబుతున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కొర్లాంలో విషాదం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

సంపత్ (ఫైల్)

గార మండలం కొర్లాం గ్రామానికి చెందిన సంపత్ అనే వ్యక్తి విశాఖపట్నంలో మృతి చెందాడు. ఉద్యోగ ప్రయత్నంలో విఫలం కావటం, ఆర్థిక ఇబ్బందులు, ఇఎంఐలు చెల్లించలేక పోవటవం వంటి కారణాలతో మృతి చెందినట్లు సమాచారం. ఫ్యాన్‌కు ఉరిపోసుకొని మృతి చెందగా కుటుంబ సభ్యులు, బంధువులు విశాఖపట్నం పయణమయ్యారు. గ్రామంలో విషాదం నెలకొంది.

ఇద్దరు అరెస్టు

నందిగాం: మండలంలోని దేవుపురం పంచాయతీ తురకలకోటకు చెందిన మేఘవరపు వెంకటరావు ఆత్మహత్య కేసుకు సంబంధించిన కేసులో వేధింపులకు గురిచేసిన బంకు యజమాని బగాది రమేష్, వజ్రపుకొత్తూరు హెచ్‌సి కె.ఈశ్వరరావులను అరెస్టు చేశామని ఎస్ఐ షేక్ మహమ్మద్ ఆలీ సోమవారం తెలిపారు. ఇద్దరినీ టెక్కలి మెజిస్ట్రేట్ ముందు హాజరపరచగా రిమాండ్ విధించినట్లు తెలిపారు.

గురుకుల విద్యార్థికి అస్వస్థత

ప్రజాశక్తి- కంచిలి

స్థానిక అంబేద్కర్ గురుకుల పాఠశాలకు చెందిన ఏడో తరగతి విద్యార్థి ఎల్.సంజయ్ సోమవారం సాయంత్రం విష కీటకం కాటుకు గురై అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే పాఠశాల సిబ్బంది విద్యార్థిని సోంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు మంచు మనోజ్ విద్యార్థికి వైద్య పరీక్షలు నిర్వహించారు. మొదట విద్యార్థిని పాము కరిచిందని అందరూ భావించినప్పటికీ, వైద్యులు పరిశీలించి పాము కాటు కాదని నిర్ధారించారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. విద్యార్థి కంచిలికి చెందిన వాడు. తండ్రి సోమేశ్వరరావు కూలి పనులు చేస్తూ, జీవనం సాగిస్తున్నాడు. విద్యార్థి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, సమాచారాన్ని విద్యార్థి తల్లిదండ్రులకు తెలియజేసినట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు. పాఠశాల ఆవరణలో జంగిల్ క్లియరెన్స్ లేకపోవడం వల్లే ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

నగదు అందిస్తున్న సభ్యులు

హెల్పింగ్ హేండ్స్ ఉదారత

కవిటి: మండలంలోని పొందూరుపుట్టుగకు చెందిన దూగానా రామ్మూర్తి మేస్త్రి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇటీవల కొజ్జిరి కూడలి వద్ద సంభవించిన రోడ్డు ప్రమాదంలో తన కుమారుడితో పాటు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనతో కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. బాధిత కుటుంబానికి వైద్యం నిమిత్తం హెల్పింగ్ హేండ్స్ ఫౌండేషన్ తరుపున సోమవారం రూ.ఏడువేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా సాయం చేసిన దాతలు, కార్యక్రమంలో పాల్గొన్న ప్రతిఒక్కరికి ఫౌండేషన్ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

పొందూరు : అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న యాత్రికులు

పలుచోట్ల అన్నదానం

పొందూరు: కార్తీక మాసం మూడో సోమవారం పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లో శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. మండలంలోని బొట్లపేట, కింతలి, రాపాక, కనిమెట్ట, కోటిపల్లి, ఇల్లయ్యగారిపేట, పొందూరు, తోలాపి, మొదలవలస, తాడివలస, గోకర్ణపల్లి, తదితర గ్రామాల్లో శివాలయాలు యాత్రికులతో కిటకిటలాడాయి. అలాగే రాపాకలో భారీ అన్నధాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమానికి పరిసర గ్రామాల నుంచి పెద్దఎత్తున యాత్రికులు తరలివచ్చారు.

రణస్థలం రూరల్: మండలంలోని బంటుపల్లి పంచాయతీ కంబాలపేటలో ఎండల మల్లికార్జున స్వామి ఆలయ సన్నిధిలో కార్తీకమాసం మూడవ సోమవారం సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే నడికుదిటి ఈశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్న సమారాధన కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పాల్గొన్నారు. ఎమ్మెల్యే ఎన్ఇఆర్ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ అన్నదాన కార్యక్రమానికి ఎచ్చెర్ల నియోజకవర్గంతో పాటు పరిసర నియోజకవర్గాల నుంచి సుమారు ఆరువేల మంది యాత్రికులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు వెలిచేటి సురేష్ కుమార్, సుధాకర్ కుమార్, సింహాచల రాయుడు, రాజశేఖర్, గోపిన కృష్ణారావు, ముంగం రమణ, చిన్నారావు, పిసిని అప్పలనాయుడు, అసిరప్పడుతో పాటు పంచాయతీ పెద్దలు పాల్గొన్నారు.

శ్రీకాకుళం సిటీ: ఉమారుద్ర కోటేశ్వరాలయంలో కార్తీకమాసం మూడవ సోమవారం పురస్కరించుకొని ఎస్-ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 2,500 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ సూర శ్రీనివాసరావు స్వయంగా కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తూ అన్నదానాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదానం చేయడం మనసుకు అపూర్వమైన ప్రశాంతతను ఇస్తుందన్నారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్, బోర్డు సభ్యులు, పట్టణ ఒకటవ

శ్రీకాకుళం సిటీ : అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

రణస్థలం రూరల్ : అన్నదాన కార్యక్రమంలో వడ్డిస్తున్న ఎమ్మెల్యే

పోలీస్ స్టేషన్ ఎస్ఐ హరికృష్ణతో పాటు పలువురు యాత్రికులు పాల్గొన్నారు.

శివాలయాలకు యాత్రికుల తాకిడి

టెక్కలి రూరల్: మండలంలోని రావివలస ఎండల మల్లిఖార్జునస్వామి ఆలయంలో కార్తీకమాసం మూడో యాత్రికులతో కిటకిటలాడింది. జిల్లా నలుమూలల నుంచి, ఒడిశా రాష్ట్రం వచ్చిన యాత్రికులు రావడంతో క్యూలైన్ భారీగా పెరిగింది. వేకువ జామున 3 గంటల నుంచే యాత్రికులు దర్శించు కున్నారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని దేవాదాయశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. అలయ కార్యనిర్వాహణాధికారి గురునాథరావు, సిఐ అంబటి విజయకుమార్ పరివేక్షి ంచారు. జెడ్‌పిటిసి మాజీ సభ్యులు ఎల్.ఎల్. నాయుడు, మాజీ సర్పంచ్ బడే జగదీశ్వరరావులు యాత్రికులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. సత్తారు వెంకటరమణ ఆధ్వర్యాన పులిహోర పంపిణీ చేశారు. టెక్కలి పట్టణంలోని రామ లింగేశ్వరస్వామి ఆలయం, ఉమామహేశ్వరస్వామి, కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయాలకు యాత్రికులు తరలివచ్చారు.

పులిహోరా పంపిణీ

టెక్కలి : కార్తీక మూడవ సోమవారం సందర్భంగా రావివలసలో ఎండల మల్లిఖార్జునస్వామి దేవాలయ ఉత్సవ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన యాత్రికులు స్థానిక గోపినాథపురం వద్ద పులిహోరా పంపిణీ చేశారు. నీటి సంఘం మాజీ అధ్యక్షులు సత్తారు వెంకటరమణ ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో వార్డు మెంబరు దవళ కుశుడు, బమ్మిడి గురివినాయుడు, సత్తారు రమేష్, అచ్యుతరావు, ప్రసాద్, కృష్ణ, పృథ్వీ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి : స్థానిక ఉమామల్లేశ్వరస్వామి ఆలయంలో ఆలయ కార్య నిర్వహాధికారి వాకచర్ల రాధాకృష్ణ, కొత్తపేటలోని శివకేశవ పంచాయతన క్షేత్రంలో ఆలయ ప్రధాన అర్చకులు బి.గౌరీశంకరశర, జర్జంగి, యలమంచిలి, సుబ్బరావుపేట, చవితిపేట, చిట్టేవలస, దంత, లఖందిడ్డి, కురుడు, లఖందిడ్డి, హరిశ్చంద్రపురం శివాలయాలు యాత్రికులతో కిటకిటలాడాయి.

మాట్లాడుతున్న ఆర్‌డిఒ వెంకటేష్

సర్వే చేసి పట్టాలు ఇస్తాం

ప్రజాశక్తి- పలాస

ఆఫ్‌షోర్ రిజర్వాయరు నిర్వాసితుల గ్రామమైన రేగులపాడు గ్రామస్తులకు సమీపంలోని కొండను సర్వే చేసి పట్టాలు ఇస్తామని ఆర్‌డిఒ జి.వెంకటేష్, ప్రభుత్వ జిల్లా లీగల్ అడ్వైయిజర్ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని రేగులపాడు కొండలో గొర్రెలు, మేకలు పెంపకం కోసం స్వాధీనంలో స్థలాలపై గ్రామంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి సమీపంలోని కొండ ఎంత విస్తీర్ణంలో ఉంది, ఎవరెవరికి ఎన్ని సెంట్లు స్వాధీనంలో ఉంది పరిశీలించి రెండు రోజుల్లో సర్వే చేపట్టి పట్టాలు ఇస్తామని చెప్పారు.ఎవరు ఆధీనంలో ఎంత స్థలం ఉంటే అంతటికీ పట్టాలు ఇస్తామన్నారు. ఆఫ్‌షోర్ రిజర్వాయరులో తమకు స్థలాలు ఇవ్వలేదని ఐదుగురు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మరో ముగ్గురు నివాసగృహాలకు నష్టపరిహారం అందలేదని చెప్పారు. మండలంలోని రామకృష్ణాపురం నిర్వాసితుల కాలనీలో ఐదు మందికి ఇళ్ల స్థలాలు ఇస్తామన్నారు. భవనాలకు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ దృష్టికి తీసుకెళ్లి నష్టపరిహారం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. వారితో పాటు తహశీల్దార్ కళ్యాణ చక్రవర్తి, ఆర్‌ఐ ప్రసాదరావు, వంశధార ప్రాజెక్టు ఎఇ మీనాక్షి పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న ఎస్‌పి మహేశ్వరరెడ్డి

విశ్రాంత హోంగార్డుకు ఆర్థికసాయం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ఇటీవల పదవీ విరమణ పొందిన విశ్రాంత హోంగార్డు తిరుపతిరావు సహచర హోంగార్డులు అందజేసిన ఒక్కరోజు గౌరవ వేతనం రూ.4.11 లక్షలు నగదు చెక్కును సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌పి కె.వి మహేశ్వరెడ్డి అందజేశారు. ఆయన మాట్లాడుతూ సహచర సిబ్బంది చూపిన ఈ సహకారం ప్రశంసనీయమన్నారు. పోలీసు కుటుంబం ఎప్పుడూ ఒకరికొకరు అండగా నిలిచి ఐకమత్య భావాన్ని పెంపొందిం చుకోవాలని పేర్కొన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం ఆరోగ్యంపై దృష్టిపెట్టి, కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలన్నారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి గోపీనాథ్, అర్‌ఎస్‌ఐ వెంకట రమణ పాల్గొన్నారు.

'వైసిపివి ముమ్మాటికీ అరాచకాలే'

ప్రజాశక్తి- పలాస

గత వైసిపి ప్రభుత్వంలో నియోజకవర్గం సోషల్ మీడియా చేసిన అరాచకాలు అంతా ఇంతా కదని, ముఖ్యంగా ఆ సమయంలో మంత్రిగా వ్యవహరించిన అప్పలరాజు అండతో పెట్రేగిపోయారని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పీరికట్ల విఠల్‌రావు అసహనం వ్యక్తం చేశారు. 2021లో ఈ అంశమై పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఆ కేసు విచారణలో భాగంగా సోమవారం స్థానిక సివిల్ జడ్జి కోర్టులో పాల్గొని మాట్లాడారు. సోషల్‌మీడియా పేరిట కొంతమందిని అప్పలరాజు పెంచిపోషించారని ఆరోపించారు. ఈ తరహా ఆకతాయిలను నియంత్రించాల్సిన బాధ్యత ఉందన్నారు.

విద్యుత్ మీటర్లకు అనుమతులు ఇవ్వాలి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

స్థానిక మేజరు పంచాయతీ పరిధిలోని ప్రకాశనగర్ కాలనీలో నిర్మించిన ఇళ్లకు విద్యుత్ మీటర్లు పెట్టుకొనేందుకు అనుమతులు ఇవ్వాలని టిడిపి మండల అధ్యక్షులు బోయిన రమేష్ కోరారు. ఈ మేరకు డిటి ప్రసాద్ సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఎన్‌టిఆర్ ప్రభుత్వ హయంలో ప్రకాశనగర్ కాలనీలో పలువురు లబ్ధిదారులకు ఇళ్లు, స్థలాలు మంజూరు చేశారని, ప్రస్తుతం ఆ ఇళ్లు శిథిలావస్థకు చేరుకోవడంతో అక్కడ నూతనంగా ఇళ్లు నిర్మించుకున్న వారికి పూర్తి హక్కులు కల్పించి విద్యుత్ మీటర్లు పెట్టుకొనేందుకు అనుమతులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మజ్జి కృష్ణారావు, మెట్ట మోహనరావు, అచ్చెయ్యరెడ్డిలు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న టిడిపి నాయకులు

ఆలయాల వద్ద ముందస్తు భద్రతా చర్యలు

ప్రజాశక్తి- లావేరు

మాట్లాడుతున్న తహశీల్దార్ శ్రీనివాసరావు తదితరులు

మండలంలోని దేవాలయాలు, చర్చిలు, మసీదుల వద్ద విశేష పర్వదినాల్లో ముందుస్తు భద్రతా చర్యలు తీసుకోవాలని, ముందుగా పోలీసులు, ప్రభుత్వ అధికార యంత్రాంగానికి తెలియజేయాలని తహశీల్దార్ గురుగుబిల్లి ఈశ్వర సత్యనారాయణ అన్నారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో కలెక్టర్, ఎస్‌పి ఆదేశాల మేరకు గ్రామాల్లోని దేవాలయాల కమిటీ సభ్యులు, చర్చి ఫాస్టర్లు, మసీదు ముస్లిం సభ్యులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని వివిధ ఆలయాల పరిధిలో జరిగే ఉత్సవాలు, జాతరలు, పర్వదినాల్లో ఆలయాల్లో జరిపే ముందు కమిటీలు అధికారులు దృష్టిలో పెట్టాలని, అక్కడ పరిస్థితిని, యాత్రికులు వచ్చే సంఖ్యను అంచనా వేసి ఏర్పాట్లు, సదుపాయాలు, అవసరమైన మేర పోలీసు సిబ్బంది భద్రతా ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. ఎస్‌ఐ జి.లక్ష్మణరావు, ఎంపిడిఒ పి.వెంకట్రాజు మాట్లాడుతూ మండలంలో దేవాలయాలు 287, చర్చిలు 38, మసీదు ఒకటి ఉన్నాయని, ప్రతీ దేవాలయం వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు తప్పనిసరిగా చేయాలన్నారు. యాత్రికులు వచ్చే సామర్థ్యాన్ని బట్టి బారికేడ్లు, క్యూ లైనులు, లోపలకి వెళ్లే మార్గం బయటకు వచ్చే మార్గాలను వేరువేరుగా ఏర్పాటు చేయాలన్నారు. ఇటీవల తాళ్లవలసలో జాతీయ రహదారి ప్రక్కన ముప్పిడి సురేష్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన సిసి కెమేరాల వలన అదే గ్రామానికి చెందిన యువకుడుని ఓ బస్సు ఢీకొని వెళ్లిపోవడంతో యువకుడు అక్కడికక్కడే మృత్యువాత పడడంతో ఢీకొన్న బస్సు వెళ్లిపోవడంతో పోలీసులు సిసి కెమేరాల సహాయంతో ఆ బస్సుని గుర్తించి తద్వారా ఆ కుటుంబానికి రూ. 5 లక్షలు ప్రమాద భీమా తోడ్పాటు జరిగిందన్నారు. సిసి కెమేరాలు అనేక విధాలుగా ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో కమిటీసభ్యులు గొర్లె అప్పలనాయుడు, కూన రామమం, బాడిత లక్ష్మణరావు, విఆర్‌ఒలు, కార్యదర్శులు, మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

ఏ రోజు పేపర్లు ఆరోజే...

టెక్కలి: ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం నుంచి ప్రారంభమైన అర్ధ సంవత్సర (ఎస్‌ఎ) పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. అన్ని రోజులకూ సంబంధించిన ప్రశ్నపత్రాలు పాఠశాలలకు చేరుకోవాల్సి ఉంది. ఏ రోజు పరీక్ష ప్రశ్నపత్రాలు ఆ రోజు ఆ రోజే పాఠశాలలకు అందజేయనున్నారు. గతంలో అర్ధ సంవత్సర పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలు లీకేజ్ ఘటనని దృష్టిలో పెట్టుకుని కూటమి ప్రభుత్వం ఆధీనంలోని విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఏ రోజుకారోజు సంబంధించిన ప్రశ్నపత్రాలు ఆ రోజే పాఠశాలలకు అందజేసేవిధంగా ఎంఇఒలు తీసుకున్న చర్యలలో భాగంగా సిఆర్‌పిలు ప్రశ్నపత్రాలు అందించనున్నారు. జిల్లా కేంద్రం నుంచి సరఫరా అయిన ప్రశ్నపత్రాలు ఆయా మండల విద్యాశాఖాదికారుల వద్దనే భద్రపరిచారు. పరీక్షల విధానంలో సంస్కరణలో భాగంగా విద్యార్థులకు అందించే ప్రశ్నపత్రం కూడా కష్టతరంగా ఉండడంతో విద్యార్థులు జవాబులు రాసేందుకు ఆలోచించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. కాగా, ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాలు మాత్రం తాము సొంతంగా ఏర్పాటు చేసిన ప్రశ్నపత్రాలు ద్వారానే పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ విషయమై సంబంధిత మండల విద్యాశాఖాధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో ప్రయివేట్ విద్యాసంస్థలు మాత్రం సొంత పరీక్షలు నిర్వహించుకోవడం గమనార్హం.

సొంత స్థలం ఉన్నవారు ఇళ్లు కట్టుకోవచ్చు

ప్రజాశక్తి- కవిటి

మల్లేశ్వరరావు

ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ-ఆవాస్ ప్లస్ పథకంలో భాగంగా సొంత స్థలం ఉన్నవారు ఇళ్లు కట్టుకునే అవకాశం ఉందని సోషల్ డెవలప్‌మెంట్ స్పెషలిస్టు చెన్నూరు మల్లేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశం నవంబరు 30 వరకు మాత్రమే అందుబాటులో ఉంటుందని చెప్పారు. సొంత ఇళ్లు అవసరమై స్థలం ఉన్నవారు తమ ఎల్‌పిసి రిజిస్టర్ డాక్యుమెంట్లు, కుల, ఆదాయ ధ్రువపత్రాలు, బ్యాంకు ఖాతా వివరాలు, ఆధార్ నంబరు, పనిచేసే మొబైల్ నంబర్‌ను తమ సచివాలయం పరిధిలోని ఇంజినీరింగ్ అసిస్టెంట్ వద్ద వివరాలు నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ పథకం అవసరమైన వారు ఏ ఇతర హౌసింగ్ పథకంలో పేరు నమోదై ఉండకూడదని స్పష్టం చేశారు. పట్టణ ప్రాంతాల్లో కూడా ఇదే విధానం అమల్లో ఉంటుందన్నారు. సంబంధిత మునిసిపల్ సెక్రటరీ, హౌసింగ్ కార్యాలయంలోని అసిస్టెంట్ ఇంజినీర్ ద్వారా దరఖాస్తులు సమర్పించుకోవచ్చన్నారు. పూర్తి వివరాలకు 9949256501 సెల్ నంబరును సంప్రదించాలని సూచించారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను విరమించుకోవాలి

మాట్లాడుతున్న రవికుమార్

ప్రజాశక్తి- ఆమదాలవలస

రాష్ట్రంలోని మెడికల్ కళాశాల ప్రైవేటీకరణను కూటమి ప్రభుత్వం వెంటనే విరమించు కోవాలని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని మెట్టక్కివలసలో వైసిపి నాయకులతో కలిసి కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేసేందుకు కూటమి ప్రభుత్వం చేస్తున్న కుట్రలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ప్రైయివేటీకరణ వలన కలిగే ఇబ్బందులు, నష్టాలను ప్రజలకు వివరించి కోటి సంతకాల కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొడ్డేపల్లి రమేష్‌కుమార్, వైసిపి నాయకులు దుంపల శ్యామ్, పొన్నాడ చిన్నారావు, రమణ మూర్తి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జ్ఞాన భారతి విద్యార్థుల విహారయాత్ర

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

విహార యాత్రలో చిన్నారులు

పట్టణంలోని జ్ఞాన భారతి ఎడ్యుకేషనల్ ట్రస్టీ సిఇఒ సెక్రటరీ జోహార్‌ఖాన్ ఆధ్వర్యాన నుంచి ఏడో తరగతి చదువుతున్న విద్యార్థులు సోమవారం విహార యాత్ర నిర్వహించారు. ఒడిశా రాష్ట్రం గోపాల్పూర్ సాగర తీరంలో ఉన్న బిజు పట్నాయక్ అడ్వెంచర్ పార్కును సందర్శించారు. విద్యార్థులకు అల్పాహారం మధ్యాహ్నం భోజనం అందించారు. పార్కులోని వినోదాత్మక క్రీడలతో ఉత్సాహంగా గడిపారు. పాటలు, క్రీడా పోటీల్లో పాల్గొన్న విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం సముద్రతీరానికి తీసుకువెళ్లి ఆహ్లాదాన్ని అందించారు. తర్వాత లైట్ హౌస్‌ను సందర్శించారు. విద్యార్థుల భద్రత కోసం పాఠశాల యాజమాన్యం ప్రత్యేకంగా సిబ్బందిని నియమించింది. కార్యక్రమంలో కార్యనిర్వాహక ట్రస్టీ వజ్రపు రమణమూర్తి, ప్రిన్సిపాల్ ఐ.బి.పండ, మేనేజర్ ప్రమోద్ కుమార్, అదనపు పరిపాలన అధికారిని సయ్యదా సుల్తానా, ట్రాన్స్‌పోర్టు మేనేజర్ అలీ ఖాన్ పాల్గొన్నారు.

పొంగిపొర్లిన సాగునీరు


వయోడాక్ట్ పైనుంచి కిందకు పడుతున్న నీరు

ఆమదాలవలస: కుడి కాలువ ద్వారా సోమవారం వంశధార అధికారులు అధికస్థాయిలో సాగునీరు విడుదల చేయడంతో పట్టణంలో కృత్రిమ వాటర్‌పాల్ పలువురిని ఆకట్టుకుంది. పట్టణ సమీపంలోని గేదెలవానిపేట జంక్షన్ వద్ద వయోడాక్ట్ పైనుంచి సాగునీరు ప్రవహిస్తుంటుంది. అయితే భారీస్థాయిలో నీరు ప్రవహించడంతో వయోడాక్ట్ ఇరువైపులా నీరు అంచులను తాకి ఆమదాలవలస, నరసన్నపేట ప్రధాన రహదారి ఆనుకొని ఉన్న ఈ వయోడాక్ట్ గేదెలవానిపేట జంక్షన్ వద్ద రహదారిపై మీద నుంచి కిందకు సాగునీరు భారీ స్థాయిలో పడడంతో మీద నుంచి కిందకి నీరు జారే విధానం అటవీ ప్రాంతంలో ఉన్న వాటర్ పాల్ మాదిరిగా కనిపించడంతో ఆ ప్రాంతంలో ఉన్న ప్రజలతో పాటు రాకపోకలు సాగించే వాహన దారులు దానిని చూసి ఆనందం వ్యక్తపరిచారు. భారీ స్థాయిలో నీటి ప్రవాహం రోడ్డుపై పడుతుండడంతో వాహనదారుల రాకపోకలకు కొంతమేర ఇబ్బందులు చోటు చేసుకున్నాయి. కొన్ని ప్రాంతాల్లో నీరు వయోడాక్ట్ మీద నుంచి కిందకు భారీస్థాయిలో పడుతుండడంతో పంట పొలాలన్ని నీటితో నిండిపోయాయి. దీంతో ఆ ప్రాంతంలో ఉన్న రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

అకౌంటింగ్ కీలకం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

మాట్లాడుతున్న రవికుమార్

ప్రస్తుతం ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో అకౌంటింగ్ కీలకమని శ్రీకాకుళం చార్టెడ్ అకౌంటెంట్ బి.రవికుమార్ అన్నారు. ప్రభుత్వ మహిళా కళాశాల అటానమస్ శ్రీకాకుళం డిపార్ట్మెంట్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ అకౌంటింగ్ డే ఉత్సవాలను సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ ప్రపంచంలో రోజురోజుకి కామర్స్, అకౌంటెన్సీ యొక్క ప్రాధాన్యత ఎంతగానో పెరిగిందన్నారు. కామర్స్ చదువుకున్న విద్యార్థులు ఎక్కువ మందికి ఉద్యోగాలు లభిస్తున్నాయన్నారు. ప్రస్తుత వ్యాపార ప్రపంచంలో కామర్స్, అకౌంటింగ్ యొక్క ఇంపార్టెన్స్ ఎంతగానో పెరగడం వల్ల విద్యార్థులందరూ అకౌంటెన్సీని బాగా నేర్చుకొని మంచి ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడాలని చెప్పారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ బహుమలులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చిన్నారావు, అధ్యాపకులు డాక్టర్ పద్మావతి, కళాశాల సిఒఇ డాక్టర్ ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

సదస్సును విజయవంతం చేయాలి

పోస్టర్ ఆవిష్కరిస్తున్న కుల నిర్మూలన పోరాట సమితి నాయకులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

భారత రాజ్యాంగం, రాజ్యాంగ వ్యవస్థల కాషాయకరణపై జరగనున్న సదస్సును విజయవంతం చేయాలని కెఎన్‌పిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి రాకోటి రాంబాబు పిలుపు నిచ్చారు. సోమవారం మండలంలోని బెలమాంలో కుల నిర్మూలన పోరాట సమితి ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ఈనెల 16న ఆదివారం ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విజ్ఞాన మందిరం వద్ద జరగనున్న రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని కోరారు. ఈ సదస్సులో ఆంధ్ర యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎన్‌డిఎ పాల్, కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.కృష్ణ ప్రధాన వక్తలుగా పాల్గొంటారని తెలిపారు. రాజ్యాంగ వ్యవస్థలైన శాసన, న్యాయ పాలన రంగాలపై జరుగుతున్న కాషాయకరణ ప్రభావం, దాని వలన కలుగుతున్న నష్టాలను ఈ సదస్సులో చర్చించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మిస్కా కృష్ణయ్య, అప్పన్న, రామారావు, నారాయణరావు, సూర్యనారాయణ, సావిత్రి, జానకమ్మ, సీతమ్మ, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ఒకేషనల్ విద్యార్థులకు శిక్షణ కీలకం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

అవగాహన కల్పిస్తున్న కమిటీ సభ్యులు

వృత్తి విద్య కోర్సులు చదువుతున్న విద్యార్థులకు ఆన్ ది జాబ్ ట్రైనింగ్ (క్షేత్రస్థాయి శిక్షణ) ఎంతో ఉపయోగకరమని ఒజెటి జిల్లా కమిటీ సభ్యులు రాంప్రసాద్, ఎంఎఎస్ శ్రీనివాస్ అన్నారు. నగరంలోని రంగా ఆటో మొబైల్స్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలురు) విద్యార్థులకు నిర్వహిస్తున్న క్షేత్రస్థాయి శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం పరిశీలించారు. జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి రేగ సురేష్ కుమార్ ఆదేశాలు, ప్రిన్సిపాల్ గణపతి వెంకటేశ్వరరావు సూచనల మేరకు ఎం అండ్ ఎటి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని అధ్యాపకులు శ్రీనివాసరావు ధనుంజయ్ తెలిపారు. డిసెంబరు 31 వరకూ జిల్లాలో ఒజెటి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాలుగు ప్రాంతీయ కమిటీలు జిల్లా వ్యాప్తంగా పర్యవేక్షణ చేస్తున్నాయని జిల్లా కన్వీనర్‌గా సీనియర్ ప్రిన్సిపాల్ బి.శ్యామసుందర్ వ్యవహరిస్తున్నారనీ డివిఇఒ తదితరులు తెలిపారు.

ఘనంగా సిపి బ్రౌన్ జయంతి

కవిటి: తెలుగు భాషా సేవకుడు చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ జయంతిని సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఎంపిడిఒ త్రినాథ్ ఆధ్వర్యాన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముందుగా సిపి బ్రౌన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం సిపి బ్రౌన్ తెలుగు భాష అభివృద్ధికి చేసిన అమూల్య కృషిని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపిడిఒ వరప్రసాద్, మండల పరిషత్ సీనియర్ సహాయకుడు శ్రీధర్, కార్యాలయ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న ఎంపిడిఒ, సిబ్బంది

పరిసరాలు శుభ్రం చేస్తున్న విద్యార్థినులు

తేలుకుంచిలో ఎన్‌ఎస్‌ఎస్ సేవలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ చేపట్టిన తెలుకుంచి ప్రత్యేక శిబిరాంని ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరావు సోమవారం ప్రారంభించారు. పరిసరాలు, పరిశుభ్రత చేపట్టారు. కార్యక్రమంలో ఎంపిటిసి మాజీ సభ్యులు సూర్యనారాయణ, సర్పంచ్ రాజశేఖర్, అధ్యాపకులు దుర్యోధన, లోకేష్, రాధ, ఎన్‌ఎస్‌ఎస్ పిఒ సంతోష్ కుమార్ పాల్గొన్నారు.